
# వివాహం పేకాట

దాట్ల నారాయణమూర్తి రాజు





# వీర భద్రరావ్ పమ్మి అందిస్తున్న ముత్యాలు పగడాలు




(గత వైభవాల నీడల్లో నిలిచి జీవితాన్ని జూదంగా వినోదించే బలమైన దివాణం సంప్రదాయాల రాతి గోడల నించీ, జీవకళతో మొలిచిన చిన్నారి మొక్క చిట్టి తల్లి !)

1

చిట్టి తల్లికి ఊహ తెలిసేటప్పటికే అంతా అయిపోయింది. ఆమెకు ఇప్పటికీ గడిచిందంతా నిన్నో మొన్నో జరిగినట్లుగా అనిపిస్తుంటుంది.

సిగడాం దగ్గర బస్సు దిగడంతోనే చినమరిది అర్జునరాజు అలంకరించిన గూడెడ్ల బండిని తీసుకు రావడం, అందులో తనెక్కి ఓ మూల ముద్ద బంతిలాముడుచు క్కూర్చోవడం, అమ్మా, బావాజీ ఇద్దరూ తనకు కనపడలేదనుకొని ఒకరికి తెలియకుండా ఒకరు కళ్ళనీళ్ళు పెట్టుకోవడం గతుకు గతుకుల దారి వెంబడి తన వూహల్లాగే మైసూరెడ్లు గణ గణమని చప్పుడు చేస్తూ పరిగెత్తడం, వూరి మొగలో దారికటూ, యిటూ పందిళ్ళను ప్రాకుతూ, ఆకుపచ్చగా కళకళ్ళాడుతున్న తమలపాకు తోటల్ని చూపిస్తూ "ఇవన్నీ మీ అత్తారి తోటలే" అని బావాజీ అన్న మాట ఇప్పటికీ జ్ఞాపకం వస్తుంటుంది. ఊరు మడదూరంలో ఉందనగా ఎందుకో బండిని ఆపుచేయించారు. అప్పుడొకసారి తలెత్తి చూసింది చిట్టి తల్లి.

"మీ అత్తవారి ఇలవేల్పు ములగాం మహాలక్ష్మికి దండం పెట్టుకో తల్లీ" బండి దిగి గుళ్ళోకెళ్ళి దండం పెట్టుకుంది.

అత్తవారిల్లు పెద్ద మొఖాసా బొంకుల దిబ్బ అవీ జారిపోయి ఇంటిముందు మొండిగోడలు కనిపించినా లోన పెద్ద మండువా లోగిలి. మావగారున్నప్పుడు జమీగా వెలిగి, దర్పాన్ని చూబెట్టిన పెద్ద భవంతి. ర్రానాను కాలంతో పాటు మారినా, దర్జాలు హుందాలు పోలేదన్న సంకేతంగా మిగిలుంది.

"సత్తెంరాజు పెళ్ళాం బాగుంద్రో" జనం తనని చూడ్డానికి తండోప తండాలుగా వచ్చారు. అప్పుడు అదంతా ఎంతో వింతగా అగుపించింది. చిట్టి తల్లికి.

అప్పటికి భర్త ఎలా వుంటాడో చూడలేదు చిట్టితల్లి. పెళ్ళిముందు తల్లి చెప్పింది. దాన్ని బట్టి అంచనా వేసుకుంది. పెళ్లిలో చూద్దామనుకుంది. తలెత్తనిస్తేగా పందిట్లో నిండా రాజులే. తన ప్రక్క కామోసు ఇటు అమ్మయ్య, అటు అత్తయ్య నిలబడ్డారు. మిగతా ఆడవాళ్ళందరూ లోగిట్లోంచి పెళ్ళి చూశారు. బైటకొస్తే, తప్పువట్టరూ రాజులు.

భర్త తనతో అన్న మొదటి మాట ఇప్పటికీ జ్ఞాపకం వుంది చిట్టితల్లికి. నన్ను నీకు కట్టబెట్టి మీ వాళ్ళు నీకు అన్యాయం చేశారేమో" బదులివ్వాలో, అక్కర్లేదో తెలీదు, తెలిసినా భర్త అడిగిన మాటకు సమాధానం చెప్పడం ఎలాగ? తలదించుకొని సిగ్గుతో మరీ వంగిపోయింది. భర్త వచ్చి తలెత్తి కళ్ళల్లో కళ్ళు పెట్టి చూశారు. అప్పుడు చూసింది ఆయన్ని. ముదర మొహం కొట్టొచ్చినట్టు కనబడింది.

ఆయనే అన్నారు " ఈ వయసులోనాకెందుకురా పెళ్ళి అన్నాను. వినిపించుకోలేదు. సరిగ్గా నాకు వయసులో పెళ్లైతే నీ అంత కూతురుండేది. నేనుపోతే నా పేరుకు ఎవరు వుండరుట. నాకొక్క నలుసుపుడితే సత్తెంరాజు పిల్లడని చెప్పుకుంటార్ట".

ఆ రోజు ఆయనలా ఎందుకు చెప్పారో అర్థం కాలేదు చిట్టితల్లికి.

అత్తవారింట్లో మూణ్ణెల్లు గడిచాయి. పరిస్థితి

కొంత పాతబడింది. ఒకరోజు సత్యంరాజే చిట్టి తల్లితోచెప్పారు.

"మీ బావాజీని మా వాళ్ళు అసలు విషయం చెప్పకుండా మోసం చేశారు. ఆ విషయం నేనైనా నీకు చెప్పకపోవడం అన్యాయం. నా పదో — ఏణ్ణుంచీ నాకు పాండురోగం. నేనిక ఎన్నాళ్ళో బ్రతకను. నేన్నీకు తెలిసి తెలిసీ అన్యాయం చేశానేమో..."

"అవేం మాటలండీ..." చిట్టితల్లిని మాట్లాడనివ్వలేదాయన.

"ఇంత చిన్నవయసులోనే నువ్వు వెల వెల బోవడం నేను చూడలేను చిట్టీ, నేను పోయాక... నువ్వెవరికీ జడవక్కర్లేదు. నీ ఇష్టం వచ్చినట్టు నీ మనస్సుకు నచ్చినట్టు నువ్వు నీ జీవితాన్ని తీర్చిదిద్దుకో..." చిట్టితల్లితో ఆయన చెప్పిన ఆఖరి మాటలు అవే.

— కానీ అలాగే జరిగింది.

పెళ్ళయి పూర్తిగా ఆరోనెల జొరబడలేదు. సత్యంరాజు చచ్చిపోయారు.

"సత్యం రాజు పెళ్ళాం బాగుందర్రో, కుందనపు బొమ్మలాగా..." అని అమ్మలక్కలు ఎందుకు జాలి చూపు చూశారో అర్థమైంది చిట్టితల్లికి.

ప్రతిసారీ భర్త తనని చూసి ఎందుకు బాధపడేవారో ఇప్పుడర్థమైంది. కానీ ఏం చేయగలదు? లేత తమలపాకు లాంటి జీవితం మాడి మసైపోయింది.

అప్పటికి చిట్టితల్లికి పూర్తిగా పదహారేళ్ళునిండాయి.

2

మడులూ, మాన్యాలు, మొఖాసాలూ పోయినా మనిషిలో మాత్రం ఏ విధమైన తీవితగ్గని రాజుగార్ల మధ్యాహ్నపుటెండ భీకరంగానూ, హుందాగానూ వుంది.

పాతకాలపు సింహద్వారానికి తలుపు రాక్షసపక్షి రెక్కల్లా వున్నాయి. సింహద్వారం దాటివస్తే రహదారి, ఆ దారి కటూ ఇటూ వూడిపోతున్న పైకప్పు కింద విశాలమైన చావిడి కనిపిస్తుంది. ఆ చావిడిలో ఒక్కదానిమీద ఏభైమంది సునాయాసంగా విశ్రాంతి తీసుకోడానికి వీలుగా రెండు పెద్ద అరుగులు పాతకాలపు దర్జాను చూపెడుతున్నాయి.

వీధిలో గానీ, లోనగానీ ఎక్కడా అలికిడి లేదు.

"ఎవర్రా... ఎవరెక్కడ ..." కేకేసుకుంటూ, చేపాటి కర్ర వూపుకుంటూ చావిడి మధ్యకొచ్చి అటూ ఇటూ చూశారు పెద రాజు గారు. రోజూ ఆ సమయానికి ఆయనొచ్చేసరికి ఆ చావిడి అంతా "దదల"తో కళకళ్ళాడుతూ వుండేది. ఇవాళ అందరికంటే ముందు వచ్చేశారు. 'ఇంకెవరూ రానట్లుంది'' తన్లో

వచ్చే వారం:

## శ్రీమతి మన్నెం శారద

## "మనసు మూగదే కాని..."

తాను అనుకొని స్తంభానికి చేరబడి కూర్చుంటూ "రాంభద్రం, ఏవోయ్ రాంభద్రం" అని పిలిచారు.

పెదరాజుగారికి అరవయ్యో పడినడుస్తోంది. కానీ ఆయనలా కనపడరు. జుట్టు నెరిసినా ఆయని పంటికి జిగిబిగి ఇంకా తగ్గలేదు. ఆయనకున్న తీవి అంతా సగం ఆయుర్దాన్నదయితే మిగతా సగం మీసాలది. పెదరాజు గారి పెత్తండ్రిగారు తుని మహారాజుల దగ్గర దివాన్‌గా ఉండేవారు. దివాన్‌గా వుండే ఆయన పెళ్ళి చేసుకోలేదుకానీ, ఆస్తి మాత్రం చాలా సంపాదించారు. తను సంపాదించి కూడబెట్టిన ఆస్తిని తానే భోగంగా అనుభవించి బ్రతికున్నన్నాళ్ళూ వైభోగంగా 'రాజం'టే 'రాజు'లా జీవించేరు. ఆయన హయామైపోయింది. పెదరాజుగారి తండ్రిగారి కాలంలో తగలెట్టగలిగినంత తగలెట్టారు. ఆస్తిని తగలెట్టినా ఈయన కూడా 'రాజం'టే 'రాజు'లా జీవించి, కొద్ది మాత్రం మిగిల్చి తనువు చాలించేరు.

పెదరాజుగారి చేతికి చెప్పుకోతగ్గ ఆస్తి కాకపోయినా, హాయిగా బ్రతకడానికి సరిపోయే సంపదకేం లోటులేదు. తనకు సంక్రమించిన ఆ ఆస్తిని పెట్టుకొని కాలుమీద కాలు వేసుకొని హుందాగా, పని పాటూ లేకుండా బ్రతకాలంటే అంతో యింతో ఆస్తిని వేనాతల వుంచుకోవాలనే నిజాన్ని వేగిరం తెల్సుకొని, నగా నట్రని నగదుగా మార్చి, నగదుని నాణ్యమైన భూములుగా మార్చుకుని అప్పట్లోనే ఆయన జాగ్రత్తపడి వూరికి "పెద్దరాజు"గారుగా "మోతుబరిగా' స్థానం సంపాదించేరు.

"ఏం బావాజీ ఎప్పుడొచ్చారు వూర్నించి" ప్రశ్నతోబాటు మనిషికూడా వచ్చాడు రాంభద్రం. రాంభద్రం వేసిన ప్రశ్నని వినిపించుకున్నారో లేదో తెలీదుకాని "ఏవోయ్ మన జట్టు ఏవీ? ముఖ్యులు వూళ్ళో లేరా... కొంపదీసి ఆటగాని ఎత్తిపెట్టేశారేవిటి?" అనుమానంగా నవ్వుతూ అడిగారు పెదరాజుగారు.

'లేదు బావాజీ, రావాలే... అందరి కంటెముందు బైరాగి తాతయ వచ్చిపోరు. ఇవాళెందుకో వెనకయ్యేరు. వెనకొచ్చే మీరు ముందయ్యేరు. ఇహ... గడియ... గడియకో వచ్చేస్తారు... అని అరుగుమీద కూర్చుని చుట్టూ ఒకసారి చూసి "ఈ సొరెండలు దమాయించి కాసేసుతన్నాయ్ బావాజీ... అడుగుతీసి వాకిట్లో వెయ్యాలంటే భయంగావుంది... అని అరుగుమీద కూర్చున్నారు.

ఈ మాటకి పెదరాజుగారేవన్లేదు, రెండ్రోజుల్నించి వూర్లో లేకపోవటం వలన ఆయన ధ్యాసంతా ఆటమీదే వుంది. ఆటగాళ్ళు వేగిరం వస్తే బావుణ్ణని అనుకున్నారాయాన.

"అవునోయ్ రాంభద్రం మను జట్టు భుక్తాయాసంవల్లో మరిదేనివల్లో కాస్త ఆలస్యం చేశారనుకుందాం, మరి ఈ కుర్రజెట్టేరోయ్ రోజూ మనకంటే ముందు చాప పరిచేసికుని పెద్ద ఆరిందాల్లా ఆట మొదలెట్టేసేవారు..."

""నేనేం చెబుతున్నా బావాజీ ఎండలు, ఇరిదాక ఉత్సాహం వున్న ఇద్దరు ముగ్గురు గుంటపాసలిలా తిరిగేరు, ఇకవొచ్చేస్తారు..."

ఒకప్పుడా వూరు పూర్తిగా రాజుల కాటపట్టై వుండేది. రాను రాను అలవాట్లకు బానిసలై కొంతమంది ఆస్తులు, ఇంకొంతమంది మతులూ పోగొట్టుకొని బ్రతుకుతెరువు వెదుక్కుంటూ వెళ్ళిపోయినవాళ్ళు వెళ్ళిపోగా ఇప్పుడున్న రాజుల బ్రతుకులు వాళ్ళ పాడుబడ్డ భవంతుల్లాగే చాలా పాతవి. వీళ్ళ దర్పాలు, అహంకారాలు, ధనమదం జారిపోయినట్టే... వాళ్ళ యింటి చుట్టూ వున్న గోడలూ జారిపోయాయి. ప్రస్తుతానికి ఏవీ లేకపోయినా "మా తాతలు తాగిన నేతుల వాసన ఇది మా మూతులలో గుబాళిస్తోంద"నే వాళ్ళే ఎక్కువ.

"ఏవోయ్ ... ఇంతాలస్యం ... పొట్టి రాజు రాగానే పలకరించారు పెదరాజు గారు.

"ఆలస్యమైపోయిందోయ్ పెదబాబూ ఆలస్యమైపోయింది. అపనా నుంచి మా ఈరకాడొచ్చాడు. అవి ఇవి పిచ్చాపాటి అయ్యాక... వారు నిద్రపోయాక ఇదిగో వచ్చేసరికి ఆలస్యమైపోయింది" ఆయన మాటలకంటే ముందు చుట్ట వాసన చుట్టూ వ్యాపించింది. ఆయన అసలు పేరు పొట్టిరాజుకాదు, ఏదో నిట్టనిలువు తాటి చెట్టంతపేరు. పొట్టి రాజంటేనే ఆయన్ని తెలుస్తుంది. మనిషి హుషారుగా వుంటాడు. తిన్నా తినకపోయినా ప్రశాంత మధురమైన నవ్వుతో ప్రతీవాణ్ణీ పలకరించడం, నవ్వించడం కొంతమంది ప్రత్యేకత. ఆయన ఆ కోవకు చెందుతారు. చిటకెలు వేయడంలో ఆయనకు ఆయనే సాటి. ఆ విషయంలో ఆయనకు

జిల్లా అంతటికి పేరుంది.

ఇంకా వీళ్ళు పూర్తిగా మాటల్లోకి మునగక పూర్వమే వచ్చేసింది కుర్రజట్టు. కుర్రజట్టంటే సావిట్లో రెండో అరుగుమీద పేకాడే రాజుల కుర్రవాళ్ళు. ఒక్కసారి సావిడంతా కళకళ్ళాడింది. ఆట ఆడేవాళ్ళు ఆరేడు గురైనా వారి చుట్టూ ఆడుతూ పందేలు కాసి గెల్చి సుళువుగా డబ్బు సంపాదించే రకవే ఆ కుర్రజట్టులో ఎక్కువ. కుర్ర జట్టులో నదరుగా కనిపించేవాడు వెంకటపతి. అత నెలా చెబితే అలా వింటారు మిగతా జనం.

"ఏం పెద్ద బావాజీ జట్టింకా రానట్టుందే" నవ్వుతూ అడిగేడు శంకరం.

"గుంటలం ఎండకి మనమే ఝడిసి పోయి ఇళ్ళ లో వుండిపోయేం. తాతలుండిపోరూ... ఏమనుకుంటారో అని అనుకోకుండా అనేశాడు ప్రభాకరం.

'మీరు మొదలెట్టండోయ్ మేం కలుస్తాం, గొప్ప హుషారుగా వున్నారండోయ్' రాంభద్రం హుషారిచ్చేరు.

రాజబాబు చేతిలో పేకసెట్టుల రెండున్నాయి. ఒకదాని మీద ఒకటి వేసి చప్పుడు చేస్తూ కొడుతున్నాడు. ఒకపేక దస్తాని లాక్కుని పై కవరిప్పి "కొత్త సెట్లెప్పుడు తెప్పించారోయ్" అని అడిగేడు సీతబాబు. అలాంటి పేకని సీత బాబెప్పుడు చూడలేదు. పేక రన్జుగా వుంది. పేక మీద బొమ్మ ఫారిన్ పాప అర్ధనగ్నంగా కవ్విస్తూ లబ్జుగా వుంది.

"పేకను పరుచుకొని పడుకుండి పోతా వేటోయ్" వర్మ విట్టువేశాడు. దానికి జట్టు జట్టంతా విరగబడి నవ్వారు. ఆ మాటకి పెద రాజుగారితో కలిసి ముగ్గురు రాజులు నవ్వేరు. కుర్రజట్టు ఆట మొదలెట్టేశారు. పెద్దజట్టు ఇంకా పిచ్చాపాటిలోనేవుంది. వాళ్ళల్లో రావలసినవాళ్ళు ఇంకా ముగ్గురున్నారు.

"బైరాగి బసకు కబురెట్టండిరోయ్" అన్నారు పెదరాజుగారు. బైరాగి తాతయ్య లేకపోతే అక్కడాడే ఆట కుపసలేదు. ఆయనకురాని జూదం లేదు. ఆయన చూడని రుచిలేదు. బైరాగి తాతయ్య వంశం జూదానికి ప్రసిద్ధి. వాళ్ళ ప్రసిద్ధి గురించి ఒక గాలి కథ కూడా వుంది. విజయనగరం మహారాజు ఆనంద గజపతిరాజుగారు ఒకసారి బైరాగి తాతయ్య ముత్తాతగారి పేరు ప్రఖ్యాతులు విని సభకు పిలిపించారట బైరాగి ముత్తాతగారి పేరు పెద్దిరాజుగారు. ఆకారంలో పెద్దిరాజు గారు ఎలావుంటారో తెలీదుగాని అనుకోవడం మాత్రం ఆజానుబాహువని, మిలా మిలా మెరిసె నురగలా తెల్లని శరీరచ్ఛాయ, ఆయన్నుచూసి ఆనంద గజపతిరాజావారే ఆశ్చర్య పోయారట. పోటీకి శత్రురాజు మీదకు దిగబడనట్లుగా సభకెళ్ళార్ట. పెద్దిరాజుగారు. ఈయన కెదురుగా పరబ్రహ్మ శాస్త్రులు పోటీ. అప్పట్లో పరబ్రహ్మ శాస్త్రులంటే మైసూరు ఆటగాళ్లక్కూడా హడలే. అంతక్రితమే శాస్త్రులవారికి, మైసూరు మహారాజావారు ఘన సన్మానం చేశారు. ఆ విసికిడి తెలిసే ఆనంద గజపతిరాజావారి పోటీకెళ్లారు పెద్దిరాజుగారు.

ఆట రెండు పొద్దులు జరిగింది. హోరా హోరీగా జరిగింది. సభామండపం గవాక్ష్యాలలోంచి అంతః పుర స్త్రీలు కూడా ఆ ఆటను చూస్తారట. గెలుపు పెద్దిరాజుగారిదే అయిందట! తర్వాత పెద్దిరాజుగారిని ఆనందగజపతి స్వయంగా సన్మానించి విజయనగరం వీధుల్లో వూరే గించేరట!

బైరాగి తాతయ్య, ఆయన్నెవరైనా ఆట గురించి అడి గితే చెప్పే విషయం అదే తర్వాత వారి తాతగారికి జూద వ్యసనం లేదట. తండ్రిగారికి లేదట. తమకంటుకుందట బైరాగి తాతయ్య చెప్పే పేకాట కబుర్లు గొప్పవిచిత్రంగా వుంటాయి. ఆయన మంచి ఉత్సాహంగా వుంటే రసవత్తరంగా వుంటాయి. ఆ వూళ్ళో కుర్రాళ్ళకి తీరు బాటప్పుడు మంచి సరదా బైరాగి తాతయ్య.

ఇంతట్లో చిరంజీవి వచ్చేరు చిరంజీవి వయసు నలభైదాటి వుంటుంది. ఆయనకేం బాధలూ, బరువులూ లేవు. విశాఖలో రెండు ప్రైవేటు ఫర్మ్‌ల్లో పావు వాటాలు వున్నాయి. పిల్లల్లేరు, తినడం కార్లమీద తిరగడం, బుడతనపల్లిలో వున్న భూముల్ని చూసుకోవడం తప్పించి మిగతా పన్లే విలేవు.

"రా ... నాయనా ... రా ... కళ్ళు కాయలు కాచి ... వాచిపోయాయి ... మా మరదలు వదిలింది కాదా..." పొట్టిరాజుగారు విట్టువేశారు చరింజీవిని చూస్తూ...

"అవును ... ఎక్కడా బైరాగి మావయ్య కనిపించడంలేదు... ఏవయ్యారు ... " అంటూ కూర్చున్నారు.

"ఏవనలేదు కానీ... బాబూ... మీ కోసం పడిగాపులు కాయాల్సొస్తోందయ్యా" పెదరాజుగారికి చిర్రెగ్గా వుంది. గంటాట పాడైపోయింది హాయిగా పడుకుంటే మంచి నిద్ర పట్టును. ఆటకని వస్తే ఆటసాగలేదు మనుషులూ పికల్లేరు. అలసటగా వుంది లేచి నిల బడ్డారాయన.

"అబ్బబ్బా... ఎండండి ... బావగారూ ... అన్నన్నా ... అందరూ వచ్చేశారే... దేనికైనా రమ్మంటే రారుగానీ... మధ్యాహ్నం పేకాటకు మాత్రం హాజరు" అప్పలరాజు బట్టబుర్రమీద తువ్వాలు తొలగించుకొని, చెమటను తుడుచుకుంటూ అన్నారు.

"ఏం బావగారు నన్ను చూసి నిలబడ్డారు. నాకు స్వాగతం పలుకుతున్నార ఏవిటి" పెదరాజుగార్నుద్దేశించి అన్నారు అప్పలరాజుగారు.

పెదరాజుగారేం మాట్లాడలేదు.

"ఇవాళ అసలేం జరిగిందంటే". ఏదో చెప్పటానికి వుపక్రమించేరు అప్పలరాజు.

"నాయనా నువ్వు కథలు మొదలుపెడితే అవి బొబ్బిలియుద్ధం కథలలాగా తరగవు కానీ... అవు... పేకతియ్యి... కలుపు" తను కూర్చుని పేకని అప్పలరాజు ముందుకి తోశారు పెదరాజుగారు.

అరుగుమధ్య పరచిన విలువైన తంజావూరు తుంగచాప రకరకాల బొమ్మలతో ఆకర్షణీయంగా, అందంగా వుంది. రాజులు ఎవరి చోటుల్లో వాళ్ళు కూర్చున్నారు. అప్పలరాజు పేక కలుపుతున్నారు. స్వంత పొలంలో పండించిన పొగాకుతో స్వయంగా చుట్టుకున్న చుట్టను అమితమైన ఆప్యాయతతో వెలిగించుకొని పెదరాజుగారు తృప్తిగా అందరివైపు చూశారు.

"బైరాగి మావగారు లేకపోతే బావగారిదే పైచేయి". నశ్యం పట్టుదట్టిస్తూ అన్నారు పొట్టి రాజుగారు. ఆ మాటకి పెదరాజుగారు మంద స్మితం చేశారు.

ఆట మొదలయ్యింది. చరింజీవి కోత కోశారు. అప్పలరాజు ముక్కలు పంచేరు. ముక్కలు సర్ సర్ మంటూ శబ్దాలు చేస్తున్నాయి. పంచడం అయిపోయింది. ఎవరి ముక్కలు వాళ్ళు చేతిలోకి తీసుకున్నారు.

## బిత్తరపోయారు!



నటి మాధవి బొంబాయిలో ఓ ఫ్లాట్‌లో ఉండి వాళ్ళతో గొడవ పడి ఖాళీ చేసిందట. మరో ఇల్లు కావలసి వచ్చి ఆమె తండ్రి మరో ఏజెంట్ ద్వారా ఆ ఇంటికే వెళ్ళాడట.

'ఇది చాలా మంచి ఇల్లు సార్! ఇంతకు ముందు సినీ తార మాధవి ఈ ఇంట్లోనే ఉండేది. ఇంటి వాళ్ళతో అనవసరంగా గొడవ పడింది. అందువల్ల ఖాళీ చెయ్యించారు. మీరీ ఇల్లు తీసుకోండి సార్! చాలా బావుంటుంది. అన్నాడట ఆ ఏజెంట్.

మాధవి తండ్రికారికి ఏం మాట్లాడాలో తెలియక బిత్తరపోయారట.

— ఎస్.

"బైరాగి ఇవాళెందుకు రాలేదో... ఆటలోకి వెళ్తూ అన్నారు పెదరాజుగారు. ఆ మాటకు ఎవరూ సమాధానం చెప్పలేదు. జవాబు రాక పోయేసరికి తలెత్తి చూశారు. ఎవరి ఆట ధ్యాసలో వాళ్ళు పడిపోయారు.

సావిడి అంతా నిశ్శబ్దంగా వుంది. ఎక్కడో వత్సవాయి వారి లోగిట్లో అరచిన కాకి అరుపులు స్పష్టంగా విన్పిస్తున్నాయి. ప్రక్కనే వూసపాటివారి మండువాలో ఆడపిల్లలందరూ చింతపిక్కలాటలు ఆడు తున్నార్లా వుంది, ఆడపిల్లల గొంతులు సన్నగా విన బడుతున్నాయి.

"ఏవోయ్ బాబూ ... సెలవులకి సుభద్ర వచ్చి నట్టుంది చూశావా..." అని రాజబాబు చెవిలో ఎవరికి వినపడకుండా మెల్లగా అడిగాడు శంకరం, రాజబాబు 'వూ' కొట్టాడు.

కుర్రజట్టు ఒక్కసారి గొల్లుమంది. ఫస్టు రౌండు లో ప్రభాకరం ఆట కొట్టేశాడు. రెండో రౌండు మొదలైంది.

"ఈ సారి ఆట నాది... కాకపోతే పందెం కాసిన వాడికి ఐదురూపాయలిస్తా..." రాజబాబు ఈ సారి ఆటతనదని అభిప్రాయపడ్డాడు. "నీక్కాదని... వెంకటపతిదని... పందెం ..." అన్నాడు సీతబాబు.

"పందెం"... అన్నాడు శంకరం రాజబాబుకు ఉషారిస్తూ.

ఆటపట్టుదలగా సాగుతోంది. ఆట మధ్యలో శంకరం, జనాంతికంగా రాజబాబు చెవిలో అన్నాడు.

"సుభద్ర బావాజీ పెళ్ళి సమ్మంధాలు చూస్తు న్నార్ట. మరి నీ సంగతి... వేగిరం అటో ఇటో తేల్చుకోక పోతే..." ప్రమాదంలో పడ తావు" ఆటలోంచి రాజబాబు మనసు సుభద్ర వైపు వెళ్ళిపోయింది.

కిర్రు జోళ్ళు చప్పుడు విన్పించేసరికి అందరూ ఒక్కసారి తలెత్తి చూశారు. బైరాగి తాతయ్య!

పొడవుగా సన్నంగా వున్నారాయన ఐశ్వర్యంలో పుట్టి పెరిగినా ఎక్కువ కష్టాలు అనుభవించడం వలన ఆయన్ని చూడగానే ఎవరికైనా ఆయ నెప్పుడూ కష్టాల్లోనే వుండే మనిషనిపిస్తుంది. గెడ్డాం చింపిరిగా పెరిగి నీరసంగా వున్న ముఖంలో ఇంకా నీరసాన్ని ఎక్కువ చేసింది. కన్నుగుడ్లు లోప లికి చొచ్చుకుపోయాయి. ఆయనెప్పుడూ లుంగీయే కట్టుకుంటారు. కాశీ వెళ్ళొచ్చిన ఎవరో సాధువుగారిచ్చిన రుద్రాక్షమాల మెళ్ళో ఎప్పుడూ వుంటుంది. ఆయన మాట నడక రెండూ నెమ్మదిగా వుంటాయి.

"హమ్మ... వచ్చావా... నాయనా... నీ కోసవే ఎదురుచూస్తున్నాను" పెదరాజుగారు సహజమైన ఆప్తుతతో అన్నారు.

మిగతా రాజులు అందరూ ఆయన రాకకు సంతోషించారు. బైరాగి తాతయ్య ఎప్పుడూ స్థంబానికి చేరబడి కూర్చుంటారు.ఆ చోట్లో ఇప్పుడు చిటికెల రాజు కూర్చున్నారు.

"రండి ... బావా ... మీ చోటు మీరు తీసు కోండి" కొంచెం అటు జరిగి కూర్చున్నారు. బైరాగి తాతయ్య నవ్వుతూ కూర్చున్నారు.

"ముందు ఇది అంటించు ఈ లోపున ఈ ఆట ఔతుంది" పెద రాజుగారు చుట్టతీసి బైరాగి తాతయ్యకు కందించేరు. తాతయ్య మౌనంగా తీసు కుని, అంటించి గుండెల్నిండా పొగపీల్చుకొని తన్మ యత్వంతో కళ్ళు మూసుకున్నారు.

ఆయనకు ఆ సమయంలో చాలా దృశ్యా లవుపించాయి. అవి ఆయనలో గిలిగించిన వత్తిడులు.ఆ సమయంలో ఆయనముఖాన్ని ఎవరు చూసినా పట్టేస్తారు. కానీ రాజులందరూ జూదం మత్తు లో వున్నారు.

పెదరాజుగారు మిడిల్‌డ్రాపుచేసి ఒక్క సారిబైరాగి తాతయ్యవైపు చూశారు.

"ఏవలా వున్నావు..." ఆమాట వినబడేసరికి కళ్ళిప్పి చూశారు బైరాగి తాతయ్య ఏం చెప్పాలో తెలీ లేదా యనకు. చెప్పాల్సినవి చాలావున్నాయి. అవి గొంతులో వుండి పోయాయి. బైటికి రావడంలేదు. ఏ కష్టవొచ్చినా, సుఖమొచ్చినా పెదరాజుతో చెప్పి సలహా అడగటం అలవాటు. ఇవాళ ఆట ఆడు దామనే వుత్సాహంలేదు. అందర్నీ పిల్చుకొచ్చి తనే ముందు కూర్చోనే వారు బైరాగి తాతయ్య. దిగు లుగా వుంది మనస్సులో.

ఈ సారి ఆట అప్పమరాజుకి అయ్యింది. డబ్బులు ఇచ్చి పుచ్చుకోడాలు అయ్యాక ముక్కలు పంచేరు. ఈసారి బైరాగి తాతయ్యక్కూడా ముక్కలు వేసేరు.

బైరాగితాతయ్య ఎందుకులావున్నారో ఎవరికీ అర్థంకాలేదు. రోజూ ఆయనొస్తునే నవ్వునీ, హుషా రునీ తీసుకొస్తారు. ఆ నవ్వు వెనకాతల, ఆ హుషారు వెనకాతల దరిద్రం, చూరుని గబ్బిలం వేలాడు తున్నదని రాజులందరికీ తెల్సు. కానీ ఇంత దిగాలు పడగా బైరాగి తాతయ్య ఎప్పుడూ ఎవరూ చూడలేదు.

"హాయ్... మురిపీ... హౌఆర్‌యూ.అవ్... బేటా... ఆవ్... కులాసా... ఎప్పుడు దిగ డ్డావు..." మురిపీని చూడగానే కుర్రజట్టు తలోరకంగా పలకరించారు. మురిపీ అందర్నీ పేరు పేరునా హుషారుగా పలకరించాడు.

మురిపీ అసలు పేరు బంగార్రాజు చిన్నప్పుడు ఆతనెప్పుడూ మురిపీలను పట్టుగొని తిరుగుతూ వాటినే ఇష్టంగా తింటూండేవాడట. అతన్ని బంగా ర్రాజంటే ఎవరికీ తెలీదు. మురిపీగానే అందరూ అతన్నెరుగుదురు.

రెండాటలు వరుసగా రాజబాబు కొట్టేశాడు.

ఈసారి ఆటలో మురిపీ కలిశాడు. ఆట మధ్య లో వర్మకి అకస్మాత్తుగా ఓ విషయం జ్ఞాపకం వచ్చింది. ఎవర్నడగాలో తెలీలేదు. తలెత్తి అందరి వైపూ చూశాడు, అందరూ తలదించుకునే వున్నారు. మరి లాభంలేదని అందరికీ విని పించేట్టుగానే అన్నాడు.

"జయమాలిని డాన్స్ ప్రోగ్రాంకి ఎవరెవరు టిక్కెట్లు బుక్‌చేయించారోయ్.."

"ఎవరూ చేయించమలేదు... ఎవరైనా వెళ్తే బావుండును..." అని అన్నాడు సీతబాబు.

"విజనగరానికి టు అండ్ ఫ్రొవిత్ హొటల్ ఖర్చు లిస్తే నేవెళ్ళి టిక్కెట్స్ తెస్తా..." అన్నాడు శంకరం.

"తెల్లవారుఝామున కనబడు..." వెంకటపతి మాటకి అందరూ ఫెళ్ళున నవ్వేరు.

శంకరం చిన్నబుచ్చుకున్నాడు.

"ఫాగ్స్ ఉన్నాయా..." అని అడిగాడు మురిపీ ప్రభాకరాన్ని, ప్రభాకరం చైన్‌స్మోకర్.

"అంటే" ఎవరో అర్థంకాక అడిగారు.

"ఫాగ్స్ అంటే సిగరెట్లు అమెరికన్ పరి భాషలో" అన్నాడు మురిపీ.

"బోడి యూనివర్శిటీలో వుంటున్నందుకు అదొక్కటే వచ్చినట్టుంది నీకు..." చిన్న బుచ్చుకొన్న శంకరం, మురిపీని చిన్నబుచ్చాడు.

బైరాగి తాతయ్యకు ఆటకాలేదు. ఆయన్తోపాటు అందరూ ఆశ్చర్యపోయారు. జీవితంలో మొట్ట మొదటిసారి పేకాటలో ఓడిపోయారాయన. ఒక ప్పుడైతే దాన్నాయన తలవంపులుకింద తీసు కునేవారు.

మరిప్పుడు?

బైరాగి తాతయ్య పెదవుల మీదకు నవ్వొచ్చింది. జీవితంలో ఓడిపోతానేమో అని అనిపించింది. అందుకు భయంవేసింది, పెదవులమీదకు వచ్చిన నవ్వు ఎంతసేపో నిలవలేదు. అకస్మాత్తుగా చిట్టితల్లి జ్ఞాప కానికి వచ్చింది, మధ్యాహ్నం జరిగిన రభస పాడు కలలా గుర్తుకొచ్చింది.

3

ఆ భోగట్టా భార్య చెప్పిందాకా ఆయనకు తెలీదు. చిట్టితల్లి వేపోసారి చూశారు బైరాగి తాతయ్య.

గుమ్మానికి చేరబడి ఎటోచూస్తూ కూర్చుంది చిట్టి తల్లి, ఆ సమయంలో బైరాగి తాతయ్యకు పట్ట లేని కోపం వచ్చింది, ఈ చెంప ఆ చెంప వాయించి బుద్ధిచెపుదా మనుకున్నారు.

"ఏవమ్మా మీ అమ్మ చెబుతోంది నిజవేనా" చిట్టి తల్లి ఆయనకు ప్రాణం పరికిణీ ఓణి వేసుకొని చిటి కినవేలు చివర్నపట్టుకొని పొలం గట్లెంబడ ఆ కబురు ఈ కబురు ఆడే చిట్టితల్లి జ్ఞాపకం వచ్చింది.

చిట్టితల్లి ఇలాంటిపని చెయ్యదు. తనకు తల వంపు తెచ్చేపని అసలు చెయ్యదు. ఇన్నేళ్ళూ "ఇంట్లో వుందా లేదా" అన్నట్టుగా పెరిగిందే తప్ప ఒకరితో వేలెత్తి చూపించుకోలేదు.

"నా మాటకు సమాధానం చెప్పమ్మా..." మళ్ళీ

ఒడిగాడు బైరాగి తాతయ్య.

"నిజమే బావాజీ" చిట్టితల్లి తండ్రి కళ్ళవేపు సూటి గా చూస్తూ చెప్పింది. బైరాగి తాతయ్య కళ్ళు తిప్పు కున్నాడు. ఇప్పుడేం చేయడం—ఏం బోధ పడలేదు.

"నేను బతికుండగానే నా పరువు తీస్తావుటమ్మా..." తండ్రి గొంతు మారింది. మళ్ళీ ఆయనే అన్నారు.

"ఇన్నాళ్ళూ ఒకరికి చెప్పానెగానీ.. ఒకరిచేత వేలెత్తి చూపించుకోలేదు, నీకు తెలుసు నిప్పులా బతి కిన క్షత్రియ కుంటుంబ మన అందులోనూ నువ్వీ నాడు ఇలా చేస్తే...

ఈ సమయం దాటితే మరిచెప్పటం అవదు.

"నేను చేస్తున్న పనిలో ఏం తప్పు లేదు బావాజీ, ఆ సంగతి నాకు తెలుసు. మీరొక క్షణం పరువు, సాంప్రదాయం,కాలం మరిచి నా సంగతి ఆలోచించండి. అప్పుడు నేను చేస్తున్న పని మంచో, చెడో మీకు తెలుస్తుంది.."

"బావుందే... బావాజీ మాటలకే ఎదురుచెప్తున్నానా.. నీవల్ల, నీ తెలివి తక్కువవని, వల్ల ఏడు తరాలదాకా వెంటాడే చెడ్డపేరు తెస్తావుటే.." తల్లి మధ్యలో నోరు చేసుకుంది.

"నువ్వాగవే. తల్లిని గసిరారు తండ్రి. తల్లివూరుకోలేదు.

"తల్లి! నీకు నచ్చినపని నువ్వుచేస్తే ఇవ తలవాళ్ళేమయిపోవాలి, ఎంతో గౌరవంగా బతు కుతున్న మీ అత్తవారెంత అవమానంతో తల దించుకుంటారో ఆలోచించావా. రేపు వాళ్ళు వెలే స్తారు. అప్పడిగిన.. ఆదుకోమంటారు..."

ఆమాటకు చిట్టితల్లేం సమాధానం చెప్పలేదు.

కూతురన్న మాటల్లో నిజంలేక పోలేదు. అంచేత కూతురు మాటలకు ఏం జవాబు చెప్ప లేకపోయారు. బైరాగి తాతయ్యకు భయం భయంగావుంది, కాలం కట్టుబాట్లు పల్లెటూళ్ళలో ఎలా రాక్షసంగా వుంటాయో ఆయనకి తెలుసు. ఇప్పుడు కూతురు స్వేచ్ఛకు కూతురు నొదిలేస్తే అందర్నీ కాదని అనుక్షణం ఎదిరిస్తూ బతకాలి! తను బతగ్గలదా?

కాఫీల వేళయిందని కుర్రజట్టు లేచారు.

"మనకు కాఫీలు తెస్తాస్తానని" రామ భద్రం లోనికెళ్ళాడు.

రాజుల సలహా అడుగుదామని వచ్చారు తాతయ్య. అందరూ పిచ్చాపాటీ కబుర్లలోవున్నారు. సమయం చూసి పెదరాజుగారితో విషయం చెప్పారు బైరాగి తాతయ్య.

ఆసావిట్లో చాలాసేపు మౌనం రాజ్యంచేసింది,

పెద్దరాజుగారు ఆలోచనలో పడ్డారు. రాం భద్రం, చిరంజీవి అసలు మాట్లాడలేను. అంతకు ఏడు మాసాలక్రితమే రాంభద్రం పింతల్లి కూతురు ఇలాంటి వెధవ పనే చేసింది, రాజు లందరూ కలసి ఆ విషయాన్ని బైటకు పొక్క కుండా జాగ్రత్తపడ్డారు. చిరంజీవి విషయం చెప్పక్కర్లేదు పట్నంలో నాలుగు రకాలను చూసే రకం.

ఆఖరికి పెదరాజుగారేఅన్నారు.

"ఇలాంటివి బైటకి రాకుండా జాగ్రత్త పడాలి ఊరికి పెద్దమనుషుల్లా బతుకుతున్నాం, మన కుటుంబాల్లోనే ఇలాటివి జరిగితే, తక్కువ కుల పోళ్ళు మన్నెలా జూస్తారో చూడు" అన్నారు.

కాఫీలయ్యాక అందరూ లేచారు.

"ఈ సమస్య నీదొక్కడిదీ నాదొక్కడిదీ కాదు. ఏం జరక్క ముందే తుంచేస్తే మంచిది, తరువాత ఎరు వులు దక్కవు." పెదరాజు మాటలకు వంత పలికేరు.

అందరూ శలవుపుచ్చుకుని వెళ్ళిపోయారు.

బైరాగి తాతయ్య ఒక్కరూ మిగిలి పోయారు.

దాని ఇష్టానికి దాన్నొదిలేస్తే వీళ్లందరూ తనని వెలే స్తారన్నమాట, డబ్బు, పలుకబడి వుంటే ఇలాంటి విషయాలు దాచినా దాగుతాయి. కూతురు చేస్తున్న పనికి తను ఇవాళొప్పుకొంటే రేపట్నుంచి వీళ్ళమధ్యకి తన్ను రానీయరు? వాళ్ల చూపుల్ని మాటల్ని భరించలేడు.

వాళ్ళందరికీ జడిసి చిట్టితల్లి కోరు కొంటున్న జీవితంలో నిప్పులు పోయడమేనా? బైరాగి తాతయ్య దారంట ఆలోచిస్తూనే వున్నారు.

బైరాగి తాతయ్య మనస్సులో ఓ ప్రక్క భయం. ఇంకో ప్రక్క కూతురి మీద సానుభూతి ఈ రెంటి మధ్యా ఆయన చాలాసేపు కొట్టుమిట్టాడాడు. ఆఖరి కాయనలో తెగింపు కత్తిదెబ్బకు రక్తంలా స్వచ్ఛంగా బయటకువచ్చింది.

రోజూ గెలిచే పేకాటలో తను ఇవాళ ఓడి పోయాడు. కానీ జీవితంలో ఓడి పోకూడదు. ధృఢ నిశ్చయం అతనిలో చోటుచేసుకుంది.

చావిడిలోకి అడుగు పెడు తూండగా—"చూసారూ... ఎంతపని చేసిందో... పోయేకాలం దిక్కుమాలిన బుద్దులూ వాడొచ్చాడు నేనెంతేడ్చి మొత్తుకున్నా విన్లేదు. బావాజీ మనసు నొప్పిస్తే క్షమించమని చెప్పమ్మా.. అని ఒక్క మాటచెప్పి ఆ ముదనష్టపు వాడితో వెళ్ళి పోయింది. రేపటినుంచి తలెత్తుకొని ఎలా తిరగడం..."

"వెళ్ళిపోయిందా" అన్నమాట బైటికని, నీ తండ్రిలో లేని ధైర్యం, సాహసం నీలో వున్నా యమ్మా, నేనే మీ ఇద్దర్నీ కలిపి, నువ్వు నవ్వుతూంటే చూడా లనుకున్నాను. ఎక్కడున్నా నాలుగు కాలాలపాటు సుఖంగావుండు.

"నువ్వెవరికీ జడవక్కర్లేదు. నీ ఇష్టం వచ్చినట్టు నీ మనసుకు నచ్చినట్టు నీవు నీ జీవితాన్ని తీర్చి దిద్దుకో." ఎప్పుడో అన్న భర్తమాటలకు అర్థం ఇప్పుడు చిట్టి తల్లికి తెలిసింది.

ఇప్పటికి చిట్టితల్లికి పూర్తిగా ఇరవై ఆరేళ్ళు నిండాయి.

(M)



నా తరం రచయితల్లో తక్కువ కథలు గాసి మంచి పేరు సంపాదించుకున్న వారిలో మిత్రుడు దాట్ల ముఖ్యుడు.

దివాణం కథల దాట్లగాను, దివాణం దాట్లగాను అతను ప్రసిద్ధుడయ్యాడు. మంచి రచయిత కావాడానికి మంచి అబ్జర్వేషన్ అవసరం అని దాట్ల కథలు చదివితే అర్థం అవుతుంది. పేరును బట్టి పెద్దవాడిలా అనిపించినా — వయసులో కుర్రాడే — వయసులో కుర్రాడైనా రచయితగా చాలా పెద్దవాడే.

ఆచార్య రోణంకి లాంటి పెద్దవుల్ని సైతం తన కథలతో మురిపించిన దాట్ల నాకు పరిచయమై నాలుగేళ్ళ మాత్రమే అయింది. పరిచయం స్నేహంగా, తర్వాత ప్రేమగా మారడానికి నాలుగు నెలలు మాత్రమే పట్టింది.

కథ విషయం—

జమీందారీలు, భవనాలు, మొఖసాలు అన్నీ పోయినా — గత కాలపు వైభవాల్ని తల్చుకుని, బాధపడి, మర్చిపోయి ఆనంద పడి — వెలుగు నీడల్లో బతుకుతున్నా ఓ రాచరికపు కుటుంబ కథ ఇది. దురదృష్ట వశాత్తు తెలుగు సాహిత్యంలో గత కాలాన్ని, నేటి కాలంతో అనుసంధానిస్తూ వచ్చిన కథలు చాలా తక్కువ. దివాణం పేకాట 2 కథ చదువుతుంటే పైన చెప్పిన కథలు రావడం ఎంత అవసరమో తెలుస్తుంది.

దివాణం జీవితాన్ని, శిధిలాలైన వారి బతుకుల్ని ప్రత్యక్షంగా చూసిన వాడు కాబట్టే దాట్ల ఇంత మంచి కథలు రాయగలిగాడు.

దాదాపు ఎనిమిది పంవత్సరాల క్రితం ఓ మాస పత్రికలో 'నాకు నచ్చిన కథ' గా దీన్ని కీ.శే. రుద్రాభట్ల నరసింగ రావు ఎంపిక చేసారు. ఇది నాక్కూడా నచ్చిన కథ.

చివరగా,

సాహిత్య రంగం వృత్తి కావడం వల్ల 'చెడి'పోయిన రచయితలు. మనకి చాలా మంది ఉన్నారు. శ్రీ దాట్ల కూడా అందులో చేరారు.

బద్ధకం వదిలించుకుని — ఒక్కసారి లేచి నిలబడి, ఒళ్ళు విరుచుకుని — మళ్ళీ మంచి కథలు రాయ వల్సిందని దాట్లని హెచ్చరిస్తూ—

'దివాణం పేకాట? లో 'రాణి' ఎలా కదిలిందో గమనించాల్సిందిగా పాఠకుల్ని కోరుతున్నాను.

— వీర భద్రరావ్ పమ్మి